క్లుప్తంగా

ఘనంగా ధనలక్ష్మి అమ్మవారి జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కె.గంగవరం: మండలంలోని సత్యవాడలో కొలువైన ధనలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాన్ని గ్రామస్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా గ్రామంలో గరగ నృత్యాలు, బుట్టబొమ్మలు, కోయడాన్సులు, పలు వేషధారణలు, వాయిద్యాలతో జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతరతో పాటు ఆలయం వద్ద నిర్వహించిన తీర్థంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని వస్తువులు కొనుగోలు చేశారు. కమిటీ సభ్యులు సలాది వీరబాబు, సలాది రాంబాబు, శ్రీరామ్‌కుమార్, ప్రకాష్ తదితరులు ఈ జాతరకు అన్ని ఏర్పాటు చేశారు.

అభాగ్యులకు అండగా..



దాత ఐఆర్‌కేను సత్కరించి జ్ఞాపికను అందిస్తున్న సంస్థ సభ్యులు

మండపేట: అభాగ్యులు, నిరుపేద వృద్ధులకు రెండు పూటల కడుపు నింపుతూ ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందని వక్తలు అన్నారు. బుధవారం సంక్రాంతి పండగను పురస్కరించుకుని సంస్థ 17వ వార్షికోత్సవాన్ని సంస్థలోని నిరుపేదలతో వ్యవస్థాపకుడు కొల్లి విశ్వనాథం ఘనంగా నిర్వహించారు. సంస్థ ఏర్పాటు నుంచి ఆర్థికంగా ఆదుకుంటూ నిర్విరామంగా అన్నదానం జరిపించేందుకు తమవంతు సహకారం అందిస్తున్న దాతలను సత్కరించారు. దాతలు ఇనపకోళ్ల రామకృష్ణ (ఐఆర్‌కే), 2వ వార్డు కౌన్సిలర్ చిట్టూరి సతీష్, పోస్టల్ ఉద్యోగి కొండపల్లి సూర్యనారాయణ తదితరులను సత్కరించి సంస్థ తరపున విశ్వనాథం కృతజ్ఞతలు తెలిపారు. ఆకలితో అలమటిస్తున్న అనాథల ఆకలి తీర్చడానికి సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామని ఆయన అన్నారు.

భీమేశ్వరాలయంలో గోపూజ



ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కనుమ పండగ వేడుకల్లో భాగంగా గోపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి సంఘం డైరెక్టర్ మృతి

రాజోలు: రాజోలు సాగునీటి సంఘం డైరెక్టర్ లక్కింశెట్టి త్రినాథస్వామి(67) హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రాజోలులో ఆటో మొబైల్ వ్యాపారం నిర్వహిస్తూ ఆర్యవైశ్య సంఘ సభ్యుడిగా, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన మృతికి రాజోలు చాంబర్ ఆఫ్ కామర్స్, రోటరీ క్లబ్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

అధికారుల ఫోన్ నంబర్లు

రాయవరం మండలం

తహసీల్దారు	: 9849903905
ఎంపీడీవో	: 9912191666
మండల విద్యాశాఖాధికారి1	: 9948523380
మండల విద్యాశాఖాధికారి2	: 7013074928
పోలీసు స్టేషన్	: 08857235333
సబ్‌ఇన్‌స్పెక్టరు	: 9440904843
రాయవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు:	8309351543, 7013003149
మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు :	8501002004, 8639015670
మండల వ్యవసాయాధికారి	: 8886613579
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో	: 7702072648
డ్వాక్రా ఏపీఎం	: 9154081283
మండల ఇంజినీరింగ్ అధికారి	: 9502377535
విద్యుత్‌శాఖ ఏఈ	: 9440812651
హౌసింగ్ ఏఈ	: 7093930489
మండల పశువైద్యాధికారి	: 8074154935
ఉద్యానవన శాఖ అధికారి	: 8712625211
గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ	: 9100121182

పల్లెల్లో సంక్రాంతి

- ప్రతి ఇంటా పండగ సందడి
- బంధువులతో ఆనంద వాతావరణం

రాయవరం: తెలుగువారి పండగల్లో ప్రముఖమైన సంక్రాంతిని ప్రజలు సంతోషాలతో జరుపుకొన్నారు. పెద్ద పండగ, కనుమను మంగళ, బుధవారాల్లో మండల ప్రజలు ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. ఏ ఇల్లు చూసినా కూతుర్లు, అల్లుళ్లు, బంధువులతో సందడి వాతావరణం నెలకొంది. ప్రతి ఇంట్లో పిండి వంటలు ఘుమఘుమలాడాయి. వీధుల్లో హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల కోలాహలం కనిపించింది. మహిళలు వేకువజామునే స్నానమాచరించి ఇంటి ముంగిట రంగవల్లులు తీర్చిదిద్దారు. అందులో గొబ్బెమ్మలను పెట్టి గౌరీదేవి వ్రతాలను ఆచరించారు. ఇంటి ముంగిటకు వచ్చిన హరిదాసులు, గంగిరెద్దుల, బుడబుక్కల వారు, పగటి వేషగాళ్లకు తమకు తోచిన సాయం చేశారు. పితృ దేవతలకు పూజలు చేసి వారి పేరిట పెద్దలకు దుస్తులు పెట్టారు. చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం దూర ప్రాంతాల్లో ఉన్నవారు ఇళ్లకు చేరుకోవడంతో అన్ని లోగిళ్లు కళకళలాడాయి. ప్రతి ఇల్లు అల్లుళ్లు, కూతుర్లు, బంధువులతో సందడి వాతావరణాన్ని తలపించాయి. చిన్నారుల నుంచి వయసు మీద పడిన వారితో సహా అందరూ నూతన వస్త్రాలు ధరించి సంతోషంతో గడిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకేచోట చేరడంతో ఏడాదిగా జరిగిన విశేషాలను పంచుకుని, జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. వీధులన్నీ రంగవల్లుల మయంగా మారాయి. పలుచోట్ల మహిళలకు స్వచ్ఛంద సంస్థలు రంగవల్లుల పోటీలు నిర్వహించి రంగవల్లుల ప్రాధాన్యానికి పెద్దపీట వేశారు.

జాతరలు.. ఉత్సవాలు

పల్లెల్లో జాతరల సందడి నెలకొంది. ఏటా పల్లెల్లో గ్రామ దేవతలకు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఏడాదిలో ఏదో ఒక రోజున గ్రామ దేవతల ఉత్సవాలను నిర్వహించినా, అధికంగా సంక్రాంతికి సంబరాలను నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా వివిధ గ్రామాల్లో గ్రామ దేవతల ఉత్సవాలను జరిపారు. గ్రామ దేవతలకు భక్తులు పసుపు, కుంకుమ, చీరలు, జాకెట్లు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ దేవతలను గరగల రూపంలో ప్రతి రోజూ ఊరేగించారు. పెద్ద పండగ, కనుమ రోజులతో పాటు బుధవారం ముక్కనుమ రోజున కూడా ఉత్సవం నిర్వహించి తీర్థం జరిపారు. పసలపూడి గ్రామ పరిధిలోని చినతలుపులమ్మ తల్లి, సోమేశ్వరం దేవాంగులపేటలో పోతురాజు తీర్థం, లొల్లలో బులిబాపనమ్మ, గోగులమ్మలకు జాతరను నిర్వహించారు. కూర్మాపురంలోని చెరువు వద్ద గ్రామ దేవత పోలేరమ్మ తీర్థం, చెల్లూరులో మద్దెమ్మతల్లి, సత్తెమ్మతల్లి తీర్థం జరిగింది. పసలపూడిలో వెంపర్తమ్మ అమ్మవారి జాతర నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోతంశెట్టి వెంకటరెడ్డి, తాతారెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, ఎస్‌వీఆర్ రెడ్డి, కర్రి వెంకటరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో జరిగింది. గరగలతో నిర్వహించిన గ్రామోత్సవం అందరినీ ఆకట్టుకుంది.

ముగిసిన వేడుకలు

కాజులూరు: మండల గ్రామాల్లో వాడవాడలా సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి పండగల్లో తొలిఘట్టమైన భోగి పండగను ప్రజలు సోమవారం ప్రారంభించుకోగా మంగళవారం సంక్రాంతి పండగను, బుధవారం కనుమను వైభవంగా జరుపుకొన్నారు. మకర సంక్రాంతి పురస్కరించుకుని గ్రామస్తులు పితృదేవతలకు పూజలు నిర్వహించి వారి పేర్లతో వృద్ధులకు పండ్లు, ఫలహారాలు, బట్టలు పంచారు. పండగ రోజుల్లో ప్రతి ఒక్కరూ తెలతెలవారక ముందే తలారా స్నానం చేసి కొత్త దుస్తులు ధరించారు. కోడిపందేలు, గంగిరెద్దుల నృత్యాలు, పలు సంప్రదాయ ఆటపాటలతో గ్రామాల్లో పండగ సందడి నెలకొంది. పలువురు ఇళ్లలో పిల్లలకు డబ్బులు, రేగిపళ్లు, పువ్వులు, అక్షతలు కలిపి భోగిపళ్లు పోసే కార్యక్రమం వేడుకగా జరుపుకొన్నారు. కనుమ పండుగ పురస్కరించుకుని పలువురు గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించారు. బంధుమిత్రుల రాకపోకలతో గ్రామాల్లో ప్రతి ఇల్లు కళకళలాడాయి.

ఘనంగా రంగవల్లుల పోటీలు

కాజులూరు: సంక్రాతి పండగ పురస్కరించుకుని కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లో రంగవల్లి పోటీలు ఘనంగా జరిగాయి. గొల్లపాలెం శివారు ధనలక్ష్మి కాలనీలో స్థానిక దళితయూత్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో గ్రామ ఉపసర్పంచ్, స్థానిక అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తాడి భువనేశ్వరిదేవి తదితరులు పాల్గొని విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పలు ఆటల పోటీలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరచుటలో యువ సంఘాలు నిర్వహిస్తున్న పాత్ర అభినందనీయమన్నారు. మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్యదర్శి నిమ్మితి విజయ్, నాగరాజు, నాగార్జున, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆదివారపుపేటలో...

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఆదివారపుపేటలో మంగళవారం రాత్రి కుంతీదేవి ఆలయం వద్ద రాంజీ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామ మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని అందమైన ముగ్గులు తీర్చిదిద్దారు. సాదే సంధ్య మొదటి బహుమతి పొందగా, సాదే దుర్గాదేవి ద్వితీయ బహుమతి, నూతలపాటి భూమిక తృతీయ బహుమతి సాధించారు. వీరికి యూత్ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

కపిలేశ్వరపురం మండలంలో...

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో శ్రీవేణుగోపాలస్వామి ఆలయం వద్ద బుధవారం రంగవల్లుల పోటీలు ఆకట్టుకున్నాయి. విభిన్న రంగులతో అద్దిన ముగ్గులను న్యాయ నిర్ణేతలు పరిశీలించి విజేతలను ప్రకటించారు. సువర్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, ప్రముఖులు తిరునాతి వెంకటేశ్వరరావు, నిర్వాహకులు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.



ఆదివారపుపేటలో వీధి దీపాల కాంతిలో ఆసక్తిగా ముగ్గులు వేస్తున్న మహిళలు



పసలపూడిలో వెంపర్తమ్మ అమ్మవారు



పసలపూడిలో వెంపర్తమ్మ జాతర సందర్భంగా గరగ నృత్యాలు



అంగరలో పోటీలో ముగ్గులు అద్దుతున్న మహిళలు

కోనసీమ అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తాం

మంత్రి సుభాష్, ఎంపీ హరీష్ మాధుర్



సంక్రాంతి సంబరాల ముగింపు సభలో పాల్గొన్న మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్

రామచంద్రపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాసుల చిరకాల వాంఛ కోటిపల్లి–నరసాపురం రైల్వే లైన్‌ను సమన్వయంతో సాధించి తీరుతామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ వెల్లడించారు. పట్టణంలోని వీఎస్ఎం కళాశాల ప్రాంగణంలో మూడు రోజుల పాటు మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి ఉత్సవ్ 2కే25 సంబరాలు ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొని ఇరువురు మాట్లాడారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన సంక్రాంతి ఉత్సవ్–2కే25 మెగా సంబరాల్లో పెద్ద ఎత్తున ప్రజల పాల్గొని సంబరాలు చేసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారంతో త్వరలో కోనసీమలో రైలు కూత వినిపిస్తుందన్నారు. గడచిన ఆరు మాసాల్లో సుమారు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, రానున్న సంవత్సరంన్నరలో ఐదు లక్షల ఉద్యోగాల కల్పన ధ్యేయంగా కృషి జరుగుతుందన్నారు. అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ మాట్లాడుతూ తన తండ్రి దివంగత బాలయోగి ఆశయాలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చుతామన్నారు. త్వరలో కోటిపల్లి–నరసాపురం రైల్వే లైన్ సాధన, అలాగే కోటిపల్లి–అయినవిల్లి రోడ్ కం బ్రిడ్జిను తీసుకొచ్చేందుకు కృషి జరుగుతుందన్నారు. ఇప్పటికే కేంద్రంతో మాట్లాడి తగిన నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. మంత్రి సుభాష్ సహకారం, ఇతర ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని కోనసీమ జిల్లాను ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి శుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా శివల ప్రభల తీర్థం



పాపమ్మ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుంటున్న ప్రభలు

కె.గంగవరం: మండలంలోని శివల గ్రామంలో కొలువుదీరిన పేరంటాలు పాపమ్మ అమ్మవారి ప్రభల తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. పరసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రభలతో అమ్మవారి ఆలయం వద్ద సందడి వాతావారణం చోటు చేసుకుంది. సుమారు 300 ఏళ్లగా పూజలందుకుంటున్న పాపమ్మ అమ్మవారికి పూజలు చేసేందుకు దంగేరు గ్రామానికి చెందిన ప్రభ ఆనవాయితీగా ఆలయం వద్దకు చేరుకుంది. గ్రామానికి చెందిన ఓబులనేని వంశీయులు అమ్మవారికి ఏటా తీర్థం ఏర్పాట్లు చేస్తుంటారు. పాపమ్మ అమ్మవారికి ఇక్కడి నుంచే అన్ని రకాలుగా పూజలు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా అమ్మవారికి తొమ్మిది రకాల వంటకాలు నైవేద్యంగా సమర్పించారు. బోనం వేసి మూడు రోజుల పాటు సంక్రాంతి సందర్భంగా ఓబిలినేని వంశీయుల కుటుంబ సభ్యులు నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగ మూడు రోజులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సంక్రాంతి సందర్భంగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఈ ప్రభల తీర్థానికి తరలివచ్చి ప్రభలను తిలకిస్తూ ఆనందపరవశులయ్యారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్ స్టేషన్ 33/11 పరిధి ఇండస్ట్రియల్ ఫీడర్, మండల హెడ్ క్వార్టర్ కపిలేశ్వరపురం ఫీడర్‌లోని గ్రామాల్లో ఈ నెల 17న ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు రామచంద్రపురం డివిజనల్ ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో పరిశ్రమలకు, కపిలేశ్వరపురం ఫీడర్ పరిధిలో కపిలేశ్వరపురం, అంగర, టేకి, మాచర, మాచరమట్టలు, శ్రీరామపురం, వెదురుమూడి, పడమర ఖండ్రిక, నల్లూరు, కాలేరు, సుభద్రాపురం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. లైన్ వెంబడి చెట్ల కొమ్మలు తొలగించడం, మరమ్మతుల నేపథ్యంలో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కె.గంగవరం: మండలంలోని పామర్రు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు 17వ తేదీ (శుక్రవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాల రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పామర్రు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని పామర్రు, కూళ్ల, కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి, మాచర, వాకతిప్ప గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ సబ్ స్టేషన్ పరిధిలో రేపు శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు సూచనల మేరకు ద్రాక్షారామ సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ తాళ్లపాలెం ఫీడర్ మరమ్మత్తుల నిమిత్తం తాళ్లపాలెం, పెద్ద తాళ్లపాలెం, జగన్నాయకులపాలెం, నెలపర్తిపాడు, వెలంపాలెం, కంబాలచెరువు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


ఉల్లాసంగా.. ఉత్సాహంగా...



ఆత్మీయ కలయికతో 1989–90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కె.గంగవరం: మండలంలో పామర్రు ఉన్నత పాఠశాలలో 1989–90 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులందరూ ఆదివారం ఒకే చోట ఏకమై సంతోషంగా గడిపారు. వారు ఒకరిని ఒకరు పలకరించుకుని సంతోషంగా గడపడమే కాకుండా పాఠశాల అభివృద్ధిలో తమ వంతు సహాయం చేయడానికి సిద్ధమయ్యారు. ఉదయం నుంచి పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టేజీపై విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అనంతరం బ్యాచీల వారీగా ఫొటోలు తీయించుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులకు పూలదండలు, శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలసి సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఉల్లాసంగా గడిపారు. తొలుత కాకినాడకు చెందిన రోటరీ క్లబ్‌కు పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు. పూర్వ విద్యార్థులు పిల్లి సూరిబాబు, ప్రతాప్‌కుమార్, అనుసూరి గోపాలకృష్ణ, పంపన రాంబాబు, వాసంశెట్టి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు, పిండి వంటల పంపిణీ



అయితపూడిలో పేదలకు దుస్తులు, పిండి వంటలు పంపిణీ చేస్తున్న కొల్లు వెంకన్న ఫౌండేషన్ సభ్యులు

కాజులూరు: సంక్రాతి పుస్కరించుకుని అయితపూడిలో కొల్లు వెంకన్న ఫౌండేషన్ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛందంగా అయితపూడి, తిప్పరాజుపాలెం, దుగ్గుదుర్రు, తనుమళ్ళ గ్రామాలకు చెందిన సుమారు 600 మంది పేదలకు బట్టలు, పిండి వంటలు పంపిణీ చేశారు. కొల్లు వెంకన్న ఫౌండేషన్ చైర్మన్, స్థానిక మాజీ సర్పంచ్ కొల్లు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ తండ్రి దివంగత కొల్లు వెంకన్న పేరున స్థాపించిన ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా 28 ఏళ్లగా ఏటా పేదలకు బట్టలు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, గ్రామంలోని అందరితో కలసి తమ కుటుంబ సభ్యులు సంక్రాతి పండగ జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వరలక్ష్మి, వెంకట సత్య రవితేజ, శృతి, వేద, వెంకట చైతన్యకృష్ణ, మణికుమారి, పంపన వెంకటేశ్వరరావు, సూరిశెట్టి రామస్వామి, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభం



బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభించిన ఎంపీ బోస్

రామచంద్రపురం: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ విద్యాసంస్థల ప్రాంగణంలో ఎంపీ నిధులు రూ.30 లక్షలతో ఆధునీకరించిన బాస్కెట్‌బాల్ కోర్టును రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ బోస్ మాట్లాడుతూ కృత్తివెంటి పేర్రాజు పంతులు ఆశయసాధనకు విద్యతో పాటుగా క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతుందన్నారు. కృత్తివెంటి గ్రౌండ్‌లో ఎంతో మంది బాస్కెట్‌బాల్ క్రీడాకారులు తయారై జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నారన్నారు. మరింతగా ప్రోత్సహించేందుకు బాస్కెట్‌బాల్ కోర్టును తీర్చిదిద్దామన్నారు. ఆర్ట్రోస్ పరిశ్రమ అధినేత అడ్డూరి జగన్నాథవర్మ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్, కౌన్సిలర్ తోట అమ్మాజీ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు గన్నమని చక్రవర్తి, జెడిపి ప్రసాద్, గొల్లపల్లి కృష్ణ, గొల్లపల్లి శ్రీనివాస్, రాయుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జాతర మహోత్సవాలు



గనిపోతురాజు ఆలయం వద్ద ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు



కాలేరులో పత్తిపాటమ్మ వారు

మండపేట: సంక్రాంతిని పురస్కరించుకుని మండపేటలో తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. పాపమ్మ పేరంటాలమ్మ, గనిపోతురాజు స్వామి వార్ల తీర్థ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక ఏడిద రోడ్డులో కొప్పిరెడ్డి వారి కుటుంబీకుల ఆడపడచు పాపమ్మ పేరంటాలమ్మ తల్లి తీర్థం సంక్రాంతి రోజున వీనుల విందు సాగగా, కేశవరంలో వేంచేసిన ఉన్న గనిపోతురాజు స్వామివారి తీర్థం, జాతర మహోత్సవాలు కనుల వైకుంఠంగా జరిగాయి. ఈ రెండు ప్రాంతాల్లో జరిగిన తీర్థాలలో ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్, రంగుల రాట్నం, జారుడుబల్లలు, తినుబండారాల దుకాణాలు, చిన్న పిల్లల ఆటవస్తువుల దగ్గర నుంచి పెద్దల వంటింటి సామగ్రి, గృహోపకరణ వస్తువుల దుకాణాలు, చెక్కబొమ్మల దుకాణాలు ఆకట్టుకున్నాయి. శాసన మండలి సభ్యుడు, వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులు వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు), ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు పలువురు ప్రముఖులు దర్శనం చేసుకున్నారు. రూరల్, పట్టణ పోలీసులు తీర్థంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

కాలేరులో..

కపిలేశ్వరపురం: కాలేరు గ్రామస్తుల ఆరాధ్య దైవం పత్తిపాటమ్మ జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయం వద్ద నుంచి గ్రామ వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలతో జాతర వైభవంగా సాగింది. గ్రామానికి చెందిన ఆడపడుచులు మొక్కులు తీర్చుకున్నారు. గురువారం ఆలయం వద్ద తీర్థం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

కోడి పందేల శిబిరాలపై దాడి

రాయవరం: కోడి పందేల శిబిరాలపై రాయవరం పోలీసులు మంగళ, బుధవారాల్లో దాడులు నిర్వహించారు. ఈ విషయాన్ని రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు బుధవారం విలేకరులకు తెలిపారు. సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని కోడి పందేలు శిబిరాలపై దాడులు చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. రాయవరం, కూర్మాపురం గ్రామాల్లో మంగళవారం కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని, నాలుగు కోళ్లు, నాలుగు కత్తులతో పాటు రూ.2,430 నగదు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నలుగురిని పట్టుకుని, నాలుగు కోళ్లు, నాలుగు కత్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండు రోజుల్లో అదుపులోకి తీసుకున్న పది మందిపై కేసులు నమోదు చేశామన్నారు. చెల్లూరులో పేకాట నిర్వహిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,400 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.